క్లుప్తంగా

రేపు మెగా హెల్త్ క్యాంపు

ఇల్లెందురూరల్: ఈ నెల 4వ తేదీన కొమరారం గ్రామ ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. అన్ని రకాల డాక్టర్లు వైద్య సేవలు అందిస్తారని, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

నేటి నుంచి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: పాల్వంచలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో నేటి నుంచి అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. 3,4 తేదీల్లో ప్రత్యేక పూజలు 5న విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభం, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి ప్రతిష్ఠ, సాయంత్రం 18 మెట్ల పూజతో పాటు పుష్పాభిషేకం, అత్తాగ పూజ, హరివరాసనం నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయంలో గురువారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

పనిభారం తగ్గించండి

పాల్వంచ: ఆశా కార్యకర్తలు పనిభారంతో సతమతమవుతున్నారని, తక్షణం వారికి పనిభారం తగ్గించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ కె.సత్య అన్నారు. గురువారం స్థానిక నవభారత్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ.. ఆశాలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, జాబ్ చార్జీలు అందించాలని, కంటి వెలుగులో పనిచేస్తున్న సిబ్బందికి అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు యశోద, స్వరూప, అమల, పార్వతి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవకతవకలు

పాల్వంచరూరల్: ఓపెన్ ఫోరంలో ఉపాధి హామీ పథకం పనుల అవకతవకలు బయటపడ్డాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మడవి సరస్వతి అధ్యక్షతన గురువారం సామాజిక తనిఖీ (ప్రజావేదిక) ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగింది. రేపు కూడా ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలంలోని 36 గ్రామపంచాయతీ పరిధిలో 2020 నుంచి 2022 మార్చి31 వరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.25,54కోట్ల వ్యయంతో జరిగిన పనుల్లో అవినీతి, అక్రమాలలు వెలుగులోకి వచ్చాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, సోషల్ ఆడిట్ ఏపీ రమణ, జిల్లా టెక్నికల్ సెల్ అధికారి పి.వెకంటేశ్వర్లు, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి అనిల్‌కుమార్, ఉపాధి హామీ అబుడ్స్ మెన్ నవీన్, ఎంపీడీఓ జి.రవీంద్రప్రసాద్, ఎస్‌ఆర్‌పీలు ఎం.సాంబశివ, కె.సురేందర్‌బాబు, ఓపీఓ రంగా, ఎంపీఎం రాంబాబు పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించాలి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో స్థానిక ఆదివాసీ గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులతో మాత్రమే ప్యానల్ గ్రేడ్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పదోన్నతులు చేపట్టాలని, భవిష్యత్‌లో చేపట్టబోయే ఉపాధ్యాయ, ఉద్యోగ నియామకాల్లో ఆదివాసీ గిరిజన అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేయాలని టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రైబల్ టీచర్స్ యూనియన్స్ జేఏసీ పిలుపు మేరకు ఈనెల 4న భద్రాచలం ఐటీడీఏ ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజన ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుబాకుల రవి, పాయం ఆనందరావు, కుంజా రవి, రాంబాబు, బుచ్చయ్య, రామారావు, వసంతరావు, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, సీతారాములు, సంపత్, మల్లేష్, స్వరూప, అరుణ, వెంకటరమణ, రాములమ్మ, హరిత, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లుగా ఎదురుచూపులు..

యూనియన్ బ్యాంకు.. ఏడాది క్రితం వరకు ఆంధ్రాబ్యాంకు పేరుతో కొనసాగింది. ఇల్లెందు కేంద్రంగా ఆంధ్రాబ్యాంకు తన కార్యకలాపాలను సుదీర్ఘకాలంగా కొనసాగిస్తోంది. ఈ బ్యాంకు పరిధిలో ఇల్లెందు పట్టణంతో పాటు కొమరారం రెవెన్యూ గ్రామాలు కేటాయించబడ్డాయి. బ్యాంకు రద్దీని దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు కొమరారం కేంద్రంగా బ్రాంచి ఏర్పాటు చేశారు. కానీ అది కాగితాలకే పరిమితమైంది. ఈ బ్రాంచి వల్ల ఖాతాదారులకు ప్రయోజనం లేకపోగా నేటికీ సుదూరంలోని ఇల్లెందు బ్రాంచికి వెళ్లి ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి.

- కొమరారంలో యూనియన్ బ్యాంకు బ్రాంచి ఏర్పాటు కాగితాలకే పరిమితం
- ఇల్లెందు బ్రాంచ్ నుంచే సేవలు
- దూరాభారంతో ఇబ్బంది పడుతున్న ఖాతాదారులు





కొమరారం గ్రామం వ్యూ
(ఇన్‌సెట్) యూనియన్ బ్యాంకు ఇల్లెందు బ్రాంచి

ఇల్లెందురూరల్: ప్రస్తుతం పెరిగిన సాంకేతికతతో నగదు మార్పిడి సులువైంది. చాలామంది బ్యాంకు వరకు వెళ్లకుండానే ఆర్థిక కార్యకలాపాలను చక్కబెట్టుకుంటున్నారు. కానీ పొదుపు సంఘాల మహిళలు, రైతులు నగదు మార్పిడి కోసం నేటికీ నేరుగా బ్యాంకులను ఆశ్రయించక తప్పడం లేదు. కానీ గతంలో ఇటువంటి సులువైన పద్ధతులు లేకపోవడంతో బ్యాంకు రద్దీని దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు కొమరారం కేంద్రంగా ఆంధ్రాబ్యాంకు బ్రాంచిని మంజూరు చేశారు. ఏడేళ్ల క్రితం అట్టహాసంగా బ్యాంకు ఉన్నతాధికారులు కొమరారంలో ఆంధ్రా బ్యాంకు బ్రాంచిని ప్రారంభించారు. ప్రత్యేకంగా మేనేజర్‌ను కూడా నియమించారు. కానీ నేటికీ కొమరారం బ్రాంచి పేరుతో కొనసాగుతున్న మేనేజర్ ఇల్లెందు బ్రాంచిలోనే తన సేవలను సాధారణ ఉద్యోగిగా కొనసాగుతున్నారు. కొమరారం బ్రాంచి పేరుతో ఆన్‌లైన్‌లో నమోదై ఉండగా ఈ బ్రాంచికి ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌ను కూడా కేటాయించడం గమనార్హం. కానీ సేవలు మాత్రం నేటికీ ఇల్లెందు బ్రాంచి నుంచే కొనసాగుతున్నాయి.

కనిపించని వినియోగదారుల సేవా కేంద్రం..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో బ్యాంకులు సైతం తమ సేవలను విస్తృతం చేస్తూ వినియోగదారుల సేవా కేంద్రాలను మంజూరు చేస్తున్నాయి. కానీ కొమరారం కేంద్రంగా యూనియన్ బ్యాంకుకు వినియోగదారుల సేవా కేంద్రం ఒక్కటీ నేటికీ ప్రారంభించలేదు. అటు మంజూరైన కొమరారం బ్రాంచి కొనసాగకపోగా ఇటు కనీసం వినియోగదారుల సేవా కేంద్రం అందుబాటులో లేకపోవడంతో కొమరారం రెవెన్యూ పరిధిలోని యూనియన్ బ్యాంకు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మహిళలు, రైతులకు మరింత ఇబ్బందులు...

ఇల్లెందు వరకు వెళ్లి బ్యాంకు సేవలు పొందుతున్న ఖాతాదారులు కొమరారం బ్రాంచి ఏర్పాటుతో సంతోషిస్తూ బ్రాంచి ఏర్పాటుకు ఎదురు చూస్తున్నారు. కానీ ఏళ్ల తరబడి ఆ బ్రాంచి ఏర్పాటుకు ముహూర్తం కుదరడం లేదు. కారణం ఎవరికీ తెలియదు. కొమరారం బ్రాంచిని ఇల్లెందు బ్రాంచిలోనే కొనసాగిస్తున్నారు. ఈ కారణంగా బ్యాంకులో ఏపని ఉన్నా కొమరారం రెవెన్యూ పరిధిలోని ప్రజలు ఇల్లెందుకు వస్తూ సమయం, రవాణా ఖర్చులు ఏళ్ల తరబడి భరిస్తూనే ఉన్నారు. ఇక పరిసర గ్రామాల ప్రజలైతే మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై యూనియన్ బ్యాంకు, ఇల్లెందు బ్రాంచి మేనేజర్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. కొమరారం కేంద్రంగా యూనియన్ బ్యాంకు బ్రాంచి గతంలోనే మంజూరైంది. కానీ సేవలు ఇల్లెందు బ్రాంచి నుంచే కొనసాగుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనైనా కొమరారం కేంద్రంగా బ్రాంచి ప్రారంభించేలా ఉన్నతాధికారుల అనుమతి తీసుకుంటామని చెప్పారు.

బ్రాంచి ఏర్పాటు చేయాలి



పొదుపు సంఘాలకు సంబంధించి ప్రతినెలా బ్యాంకు వరకు వెళ్లి పొదుపు, అప్పు చెల్లించాల్సి వస్తోంది. దీనికోసం ప్రతినెలా తమకు ఆర్థిక భారం తప్పడం లేదు. కొమరారం బ్రాంచిని మా ఊళ్లోనే ఏర్పాటు చేస్తే ప్రయోజనం చేకూరుతుంది.

– మంచె సుశీల, పొదుపు సంఘం సభ్యురాలు, కొమరారం

అందరికీ ప్రయోజనం



ఈ రోజుల్లో అందరికీ బ్యాంకులతో పని ఉంటోంది. నగదు దాచుకోవడం మొదలు.. అప్పులు తీసుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడం వంటి పనులన్నింటికీ బ్యాంకు వరకు వెళ్లక తప్పడం లేదు. బ్రాంచి ఏర్పాటు అందరికీ ప్రయోజనమే.

– గైగొళ్ల కృష్ణ, రైతు, కొమరారం

విద్యారంగాన్ని ఆదుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, అదేవిధంగా ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థుల పరీక్ష పేపర్లను ఆన్‌లైన్ వాల్యుయేషన్ చేయాలని విద్యాశాఖ మంత్రి ఆదేశం మేరకు నవీన్ మిట్టల్ నిర్ణయం సరైంది కాదని, దానిని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇల్లెందు: ప్రభుత్వం విద్యారంగాన్ని అదుకోవాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. గురువారం ఎమ్మెల్యే హరిప్రియను కలిపి వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎ.సాంబ మాట్లాడుతూ.. సరైన సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యారంగం కునారిల్లుతోందన్నారు. కనీసం పాఠశాలలకు అటెండర్లు, స్కావెంజర్లు కూడా ఏర్పాటు చేసుకోలేని దుస్థితిలో పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గణేష్, ప్రవీణ్, ప్రభాకర్, సిద్ధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌ను జూలూరుపాడులో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. త్వరలో ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.3,568 కోట్లు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంటును విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు బోడా అభిమిత్ర పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ఉద్యమం



టేకులపల్లి: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఓడబ్ల్యూ కార్యకర్తలు

ఇల్లెందు: పలు రంగాల్లో పని చేస్తున్న మహిళలు ఎలాంటి హక్కులు లేకుండా సమిధలు అవుతున్నారని, అలాంటి వారి కోసం ప్రగతిశీల మహిళా సంఘం ఉద్యమిస్తుందని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి బయ్యా శారద అన్నారు. గురువారం ఇల్లెందులో పీఓడబ్ల్యూ మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఈ నెల 7,8 తేదీలలో మహబూబాబాద్‌లో జరగనున్న మహాసభలు, బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మోకాళ్ల సుగుణ, రేళ్ల నాగలక్ష్మి, రుక్మిణి, కమల, కల్పన, శ్రీదేవీ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: భూస్వామ్య, సామ్రాజ్యవాద, పితృస్వామిక భావజాలానికి వ్యతిరేకంగా పోరాడేందుకు మహిళలు తరలిరావాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా గౌరవ అధ్యక్షురాలు నోముల కళావతి, జిల్లా నాయకురాలు భూక్యా చిన్ని పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను గురువారం మండలంలోని బద్దుతండా, టేకులపల్లి గ్రామాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 7,8 తేదీల్లో మహబూబాబాద్‌లో జరిగే పీఓడబ్ల్యూ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం హిందుత్వాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. ఫాసిస్టు రాజకీయాలు స్త్రీల జీవితాల్లోకి చొచ్చుకుని వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర మహాసభలకు మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తోటకూరి చిట్టెమ్మ, చింతలాలమ్మ, లక్ష్మి, కౌసల్య, రాజేశ్వరి, కమల, వసంత, కృష్ణవేణి, భూక్యా హర్ష్య, భూక్యా నర్సింగ్, నోముల భానుచందర్, తోటకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వహణకు ప్రాధాన్యమివ్వండి



మొక్కలను పరిశీలిస్తున్న మధుసూదన్‌రాజు

ఇల్లెందురూరల్: నర్సరీ నిర్వహణకు గ్రామ పంచాయతీలు అధిక ప్రాధాన్యమివ్వాలని డీఆర్‌డీఓ పీడీ మధుసూదన్‌రాజు ఆదేశించారు. సుభాష్‌నగర్, బాలాజీనగర్, సుదిమళ్ల, బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలలో నర్సరీలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం నిల్వ ఉన్న మొక్కలను పరిశీలించిన ఆయన అవసరమైన ప్రాంతాలలో నాటాలని సూచించారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లలో మొక్కలను విధిగా పెంచుకునేలా ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నర్సరీలలో మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. రోజులో కనీసం ఒక్కసారైనా నర్సరీని సందర్శించి మొక్కల బాగోగులను చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పారావు, గ్రామపంచాయతీ కార్యదర్శులు షర్మిల, రజినీకాంత్, ఈసీ శంకర్, టీఏ శ్రీను, ఎఫ్ఏ బిజ్జాలు, కిరణ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



ధర్నా చేస్తున్న గ్రామీణ పేదల సంఘం కార్యకర్తలు

ఇల్లెందురూరల్: పోడు భూములకు పట్టాలివ్వాలని, అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ పేదల సంఘం, యూసీసీఆర్ఐ ఎంఎల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కృష్ణవేణికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏపె వెంకన్న, యూసీసీఆర్ఐ ఎంఎల్ జిల్లా నాయకుడు దండా లింగయ్య మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలిస్తామని ప్రకటించిన ప్రభుత్వం మూడేళ్లుగా రైతుల ఆశలతో దోబూచులాడుకుంటూ ఏడాది క్రితం దరఖాస్తులు స్వీకరించిందని చెప్పారు. దరఖాస్తుల పరిశీలన పేరుతో ఏడాదిగా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన సీఎం కేసీఆర్ అరకొరగా మంజూరు చేస్తూ పేదలను మోసం చేశారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా పోడు భూములు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో జాప్యం చేయకుండా ప్రతిఒక్కరికీ మంజూరు చేయాలని లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కల్తి ఎర్రబాబు, బాలకృష్ణ, భద్రయ్య, రుక్మిణి, తోట లక్ష్మి, లక్ష్మాచారి పాల్గొన్నారు.

ఏసీడీ వసూళ్లు నిలిపి వేయండి

ఇల్లెందు: విద్యుత్ వినియోగదారుల నుంచి ప్రభుత్వం అడ్వాన్స్‌గా కన్వియన్స్ డిపాజిట్ (ఏసీడీ) పేరుతో అదనపు డిపాజిట్ వసూళ్లు చేయటం విరమించుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. గురువారం ఇల్లెందులో విద్యుత్‌శాఖ ఏడీఈ, ఈఆర్‌ఓ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించి ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల జేబులకు చిల్లులు పెట్టి తన జేబులు నింపుకుంటోందన్నారు. తక్షణం ఏసీడీ పేరుతో వసూళ్లు నిలిపివేయాలని కోరారు. ప్రతినెలా ఇందన సర్దుబాటు చార్జీలను పెంచుకోవచ్చని రెగ్యులేటరీ కమిషన్ అనుమతులు అవసరం లేదని తెలుపుతూ డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డిస్కం)లకు విద్యుత్ నియంత్రణ మండలి స్వేచ్ఛ కల్పించటంపై విమర్శించారు. విద్యుత్ వినియోగదారుల మీద భారం మోపే ఆదేశాలు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ధర్నాలో సీపీఎం నేతలు కృష్ణ, కిరణ్, నాగరాజు, కోటేశ్వరరావు, లక్ష్మణ్‌పాసీ, కుమార్, భద్రయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్లకు గురుకుల యాజమాన్యం



విద్యార్థులను ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లెందు: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవడంతో ఏటా ఖాళీలు మిగిలిపోతున్నాయి. తాజాగా అడ్మిషన్ల ప్రక్రియ అప్పుడే మొదలైంది. ఇల్లెందులోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల యాజమాన్యం ఆశాఖ అధికారులతో కలిసి విద్యార్థుల ఇళ్లకు వెళుతున్నారు. గురువారం ఆ శాఖ జిల్లా విజిలెన్స్ విభాగం అధికారులు కె.సీతారాములు, ఎండీ జమీల్‌పాషాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్‌లు బి.కృష్ణ, ముద్దసిర్ హుస్సేన్ మైనార్టీలు అత్యధికంగా నివసించే ప్రాంతాల్లో ఇంటింటి వెళ్లి 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థులను ఆహ్వానించారు. ముస్లిం మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు చెందిన వారు తమకు కేటాయించిన సీట్లకు అర్హులని తెలిపారు. ఈ నెల 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీగా తెలిపారు. మైనార్టీ గురుకులాల్లో ఉచిత విద్యతో పాటు ఉచిత వసతి కల్పించి ప్రతి ఏడాది ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.లక్షకు పైగా నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, గౌస్, సాధిక్‌పాషా, రెహానా తబస్సు, పీడీ నజీముద్దీన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని పండిట్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం డీఈఓ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు జె.రాంసింగ్ మాట్లాడుతూ.. పండిత్ రాష్ట్ర జేఏసీ ఆదేశాల మేరకు తరగతుల సహాయ నిరాకరణ విషయాన్ని తెలియజేసి, వారికి సహకరించాలని కోరారు. బి.శ్రీనివాస్, రతన్‌సింగ్, వీరునాయక్, వీరన్న, గోపిచంద్, కరీముల్ల పాల్గొన్నారు.

టీజీఎల్‌బీకేఎస్ మహాసభలను జయప్రదం చేయండి

టేకులపల్లి: ఈనెల 4న గోదావరిఖనిలో జరిగే తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఇఫ్టూ) 11 రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏరియా కార్యదర్శి రాయండ్ల కోటిలింగం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కేటీసీలో ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గని కార్మికుల సమస్యలు పట్టించుకునే స్థితిలో లేవన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగుల ఆదాయపు పన్నుపై కనీసం చర్చ కూడా జరగలేదన్నారు. వినోద్, సమ్మయ్య, పుల్లయ్య, కార్మికులు పాల్గొన్నారు.

వితరణ



పాఠశాల గేటును ప్రారంభిస్తున్న ఎంఈఓ వెంకట్

జూలూరుపాడు: వినోభానగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు నూతనంగా ఏర్పాటు చేసిన గేటును గురువారం జూలూరుపాడు ఎంఈఓ గుగులోత్ వెంకట్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్ శ్రీనివాసరావు, వినోభానగర్ సర్పంచ్ భూక్యా పద్మ, గ్రామపెద్దలు చిలుకూరి కృష్ణయ్య ప్రారంభించారు. గ్రామసర్పంచ్ భూక్యా పద్మ, ఉపసర్పంచ్, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలకు గేటును వితరణగా అందజేశారు. హెచ్‌ఎం బి.సరళ, టీచర్లు భువనేశ్వరి, శంకర్, అంగన్‌వాడీ టీచర్ ఆదిలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

టేకులపల్లి: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఇస్లావత్ నామానాయక్, గోలియాతండా సేవాలాల్ ఆలయం చైర్మన్ ఇస్లావత్ సాయికృష్ణ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎల్.వీరభద్రం చేతుల మీదుగా సేవాలాల్ జయంతి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రత్తయ్య, వెంకటేశ్వర్లు, సాములు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కిట్లు పంపిణీ



దివ్యాంగులకు కిట్స్ అందజేస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సదుపాయాలు అందేలా కృషి చేయాలని జిల్లా విద్యాధికారి ఎస్ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. గురువారం కొత్తగూడెం రైటర్‌బస్తీలోని భవిత కేంద్రంలో జరిగిన మానసిక దివ్యాంగులకు కిట్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాలైన సదుపాయాలను దివ్యాంగులకు కల్పిస్తోందని, అలాంటి ప్రయోజనాలను ప్రతి విద్యార్థికి అందేలా జిల్లాలోని సమ్మిళిత విద్యా రిసోర్స్‌పర్సన్లు కృషి చేయాలన్నారు. దివ్యాంగుల కొరకు రిసోర్స్‌పర్సన్లుగా పనిచేయడం ఉద్యోగంగా భావించకూడదని, దేవుడు మనకు కల్పించిన గొప్ప సేవగా, సదవకాశంగా భావించాలని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వాటిని ప్రతి ఒక్కరికి అందేలాగా జిల్లా విద్యాశాఖ చేస్తున్న కృషిని అభినందించారు. జిల్లా కోఆర్డినేటర్ ఎస్కే సైదులు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు 1900 మంది ఉన్నారని, వీరికోసం జిల్లా విద్యాశాఖ ప్రత్యేకంగా భవిత కేంద్రాలను నిర్వహిస్తూ, పాఠశాలకు రాలేని విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా హోం బేస్డ్ ఎడ్యుకేషన్ కూడా అందిస్తోందని, జిల్లాలో జరిగే సదరం క్యాంపులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని పిల్లలు తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం మానసిక దివ్యాంగులకు నేషనల్ ఇనిస్ట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ది పర్సన్స్ సంస్థ వారు అందజేసిన కిట్స్‌ను పంపిణీ చేశారు. మండల విద్యాధికారి జుంకీలాల్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి కె.అమరావతి, సమ్మిళిత విద్యా రిసోర్స్‌పర్సన్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు ఇంకెన్నాళ్లు?



మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ప్రజలు మంచినీటికి ఇంకా ఎన్నాళ్లు ఇబ్బందులు పడాలని, తక్షణమే మంచినీళ్ల సమస్యను పరిష్కరించాలని కిన్నెరసాని నీళ్లను ప్రతిరోజూ అందించాలని ఉద్యమఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెంలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో నర్సయ్య మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రతిరోజూ కిన్నెరసాని నీళ్లు సరఫరా చేస్తామని హామీ ఇచ్చి గెలిచాక ప్రజా సమస్యలను విస్మరించారని ఆరోపించారు. రోజుకు ఒక్కపూట వచ్చే కిన్నెరసాని నీళ్లు మూడు నెలలుగా మూడు రోజులకోసారి అదీ ఒక గంటపాటు వస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. మిషన్ భగీరథతో ఇంటింటి మంచినీటిని అందిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 36వార్డులో మంచినీళ్లను రెండు రోజులకోసారి కూడా వదలడం లేదన్నారు. కిన్నెరసాని పైపులైన్లకు మరమ్మతుల పేర్లతో రూ.లక్షలు ప్రజాధనం వృథా చేస్తున్నారని, ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా మంచినీటిని ఎందుకు అందించలేక పోతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రతిరోజూ అన్ని వార్డులోని ప్రజలకు మంచినీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలీబాబా, అల్లిభాస్కరరావు, శ్రీపాద సత్యనారాయణ, ఎడ్ల ఏలియా, కాకెల్లి సైమన్, సప్తార్‌బేగ్, దేవునపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

దశాబ్దాలుగా ఎదురుచూపులు..

టేకులపల్లి మండలం సులానగర్ నుంచి ప్రెగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడెం రహదారికి మోక్షం లభించడం లేదు. దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు పక్కా రోడ్డు కోసం ఎదురు చూస్తున్నారు. కంకర వేసి దశాలేస్తున్నారు కానీ, పక్కా రోడ్డు నిర్మించడం లేదు. పంట పొలాలకు వెళ్లే రైతులు, తూర్పుగూడుం, బేతంపూడి రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పక్కా రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : రాజు, ఏఈ పీఆర్, టేకులపల్లి
సెల్ నంబర్ : 9676029621